క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా...



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని నెల్లూరుకు చెందిన పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి చీదెళ్ల కిషన్ ఆదివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న రోజుల్లో పార్టీ యువజన విభాగం నిర్వహించాల్సిన పలు అంశాలపై చర్చించారు.

గణేష్ ఘాట్ పరిశీలన



నెల్లూరు(బారకాసు): నగరంలోని గణేష్ ఘాట్‌ను ఎంహెచ్‌ఓ డాక్టర్ కనకాద్రి ఆదివారం పరిశీలించారు. వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం వారికి పలు సూచనలు చేశారు.

డయల్ యువర్ డీఎం-1 నేడు

నెల్లూరు సిటీ: డయల్ యువర్ డీఎం-1 కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు డీఎం-1 ఇన్‌చార్జి మేనేజర్ ఎం.సునీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య 99592 25641 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలు ఇవ్వాలన్నారు.

ఉత్సాహంగా శతమానంభవతి



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వాకర్స్ సభ్యులకు నిర్వహించే శతమానంభవతి కార్యక్రమాన్ని ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో అసోసియేషన్ సభ్యుల పుట్టినరోజు వేడుకలను నిర్వహించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కిలారి శ్రీనివాసులునాయుడు, గువ్వల నారాయణరెడ్డి, మాగంటి ప్రసాద్, నలుబోలు బలరామయ్యనయుడు పాల్గొన్నారు.

ఎస్టీపీని సందర్శించిన కమిషనర్



నెల్లూరు(బారకాసు): సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ స్టడీ టూర్‌లో భాగంగా హైదరాబాద్ నగరం నాగోల్ ప్రాంతంలోని మురుగునీటి శుద్ధి కర్మాగారాన్ని (ఎస్టీపీ) నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ నందన్ ఆదివారం సందర్శించారు. వివిధ అంశాలపై ఆయన అధ్యయనం చేశారు.

పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి



మాట్లాడుతున్న ఏపీ కౌలు రైతు సంఘం నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రైతుల పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాల గురున్నాథం, కార్యదర్శి తుళ్లూరు గోపాల్ డిమాండ్ చేశారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం తగిన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ ఈనెల 29వ తేదీ ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పాట్టేపాళెం చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ క్రీడాకారుల ఎంపిక

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సెప్టెంబర్ 9 నుంచి 11వ తేదీ వరకు జరిగే విద్యుత్ క్రీడాపోటీలకు సంబంధించి సోమవారం ఎంపికలు జరుగుతాయని ఆ శాఖ జిల్లా స్పోర్ట్స్, గేమ్స్ సెక్రటరీ రామస్వామి వేలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన ఏపీఎస్పీడీసీఎల్‌లో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులు, జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్ -2 సిబ్బంది ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో సాయంత్రం 4 గంటలకు నిర్వహించే సెలక్షన్స్‌కు హాజరు కావాలని కోరారు.

నిర్వహణ లేక.. నీటి కష్టాలు

అతిపెద్ద వాటర్ ప్లాంట్‌ను గాలికొదిలేశారు

ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు భారత ప్రభుత్వం డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో బుజబుజ నెల్లూరులో ఏర్పాటు చేసిన అతి పెద్ద మినరల్ వాటర్ ప్లాంట్‌ను నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యంతో మూసివేశారు. దాదాపు 18 వేల మందికిపైగా జనాభా ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. కేవలం రూ.2కు క్యాన్ నీటిని ప్రజలు తీసుకుని వెళ్లేవారు. అలాంటి ప్లాంట్‌ను మూసివేయడంతో రూ.15 నుంచి రూ.20 పెట్టి క్యానునీటిని ప్రైవేటు ప్లాంట్ల నుంచి కొనుగోలు చేసే పరిస్థితి ఏర్పడింది.

- మూలన పడేసిన రూ.కోట్ల విలువ చేసే మెషినరీ
- అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు తాగునీటి అవస్థలు



పిచ్చిమొక్కల మధ్య వాటర్ ప్లాంట్‌లో తుప్పు పడుతున్న మెషినరీ

నెల్లూరు(అర్బన్): గతంలో బుజబుజనెల్లూరు పంచాయతీగా ఉండేది. సుప్రీంకోర్టు ఆర్డర్ ప్రకారం పంచాయతీలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు భారత ప్రభుత్వం 2009లో రూ.2 కోట్లతో పెద్ద మినరల్ వాటర్ ప్లాంటును మంజూరు చేసింది. అందులో భాగంగా 22 ఏప్రిల్ 2012లో ఈ ప్లాంటును ప్రారంభించారు. పద్మవిభూషణ్, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్, ఆనాటి భారత ప్రభుత్వ సెక్రటరీ డాక్టర్ టి.రామస్వామి, నాటి ఆర్థిక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ఈ ప్లాంటును ప్రారంభించారు. రూ.కోటి విలువ చేసే మెషినరీని ఏర్పాటు చేశారు. మరో రూ.కోటితో సీవేజ్ ప్లాంట్, ప్రహరీలను కూడా ఏర్పాటు చేశారు. ఇది దేశంలో రెండో పెద్ద ప్లాంట్‌గా ఉండేది. వాటర్ సిస్టమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ చెన్నై వారు ప్లాంటు నిర్వహణ బాధ్యతలను చూసేవారు.

గాలికి వదిలేశారు

బుజబుజనెల్లూరు ప్రాంతాన్ని తర్వాతి కాలంలో నెల్లూరు నగరపాలక సంస్థలో కలిపారు. అందులో భాగంగా వాటర్ ప్లాంట్ నిర్వహణ 2018–19లో నగరపాలక సంస్థలోకి వచ్చింది. వాటర్ సిస్టమ్స్ ఇండియా లిమిటెడ్ వారు రూ.56,78,973లు బకాయిలున్నారంటూ నగరపాలక సంస్థ నిర్వహణను గాలికొదిలేసింది. చిన్న చిన్న మరమ్మతులకు కూడా నిధులు ఇవ్వలేదు. దీంతో ప్లాంటు మూతపడింది. ఫలితంగా నేడు ప్రజలకు మినరల్ వాటర్ అందని ద్రాక్షగా మారింది. బుజబుజనెల్లూరు ప్రాంతంలో ఉండే వారు 80 శాతం మంది కార్మికులు, కర్షకులు, దళితులు. రూ.2కు క్యాను నీటిని తీసుకునే ఇక్కడి ప్రజలు ఇప్పుడు రూ.20లకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వచ్చింది.



వాటర్ ప్లాంటు ముందు భాగం

ఆ స్థలంపై అధికార నేతల కన్ను

సుమారు అర ఎకరా స్థలంలో ప్లాంటును ఏర్పాటు చేశారు. ఇప్పుడు అధికార పార్టీకి చెందిన నేతల కన్ను ఆ స్థలంపై పడిందని ప్రజలు పేర్కొంటున్నారు. మెషినరీని తీసేసి ఆ స్థలాన్ని సొంతం చేసుకునేందుకు పావులు కదుపుతున్నారంటూ ప్రచారం జరుగుతోంది. ఇప్పటికైనా అక్కడి ప్లాంటుకు మరమ్మతులు చేసి పునరుద్ధరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కలెక్టర్‌కు అర్జీలు ఇచ్చాం

ఈ ప్లాంట్‌ను పునరుద్ధరించాలని కలెక్టర్‌కు ఎన్నో దఫాలు గ్రీవెన్స్‌లో అర్జీలు ఇచ్చాం. అయినా పట్టించుకోవడం లేదు. తామంతా చిన్న, చిన్న కూలి పనులు చేసుకుని బతికేవారం. అందువల్ల తమ గోడు ఎవరూ వినడం లేదు.

– కృష్ణమూర్తి, స్థానికుడు

ఆందోళన చేస్తాం

తమ డివిజన్‌లో మూసేసిన వాటర్ ప్లాంటును నిర్వహించాలని గతంలో కౌన్సిల్‌లో చర్చ జరిపేలా చేశాం. అప్పట్లో రూ.14 లక్షలు ఖర్చవుతుందని అధికారులు తెలిపారు. తర్వాత ఎలాంటి విచారణ లేకుండానే ప్లాంటు నిర్వహణ అంశాన్ని కౌన్సిల్‌లో తిరస్కరించారు. ఇప్పటికైనా ప్లాంటును రీ ఓపెన్ చేయాలి. లేదంటే ఆందోళన చేస్తాం.

– కొండా ప్రసాద్, స్థానికుడు, సీపీఎం రూరల్ నియోజకవర్గ కార్యదర్శి

వాటర్ ప్లాంట్ పునరుద్ధరణకు ధర్నా

నెల్లూరు(అర్బన్): బుజబుజనెల్లూరులోని ప్రభుత్వ మినరల్ వాటర్ ప్లాంట్‌ను పునరుద్ధరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కె.పెంచలనరసయ్య, సీపీఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో కార్యకర్తలు మినరల్ వాటర్ ప్లాంట్ వద్ద ఆదివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుజబుజనెల్లూరులో ఫ్లోరిన్ నీటి సమస్య ఉండడంతో ఇక్కడ మెగా మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారన్నారు. అయితే నెల్లూరు కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రస్తుతం మూలన పడిందన్నారు. ఫలితంగా ఇక్కడి ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా అధికారులు ప్లాంట్‌ను పునరుద్ధరించాలని.. లేకుంటే ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సోమవరపు వెంకయ్య, కృష్ణమూర్తి, ఈశ్వరయ్య, గంగాధర్, తిరుపాలు, శ్రీనివాసులు, బాలకృష్ణ, పెంచలయ్య, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

సూట్‌కేసును గుర్తించి.. అప్పగించి..



సూట్‌కేసును అప్పగిస్తున్న కానిస్టేబుల్

నెల్లూరు(క్రైమ్): ఆటోలో మరిచిపోయిన సూట్‌కేస్‌ను సాంకేతికత ఆధారంగా పోలీసులు గుర్తించి బాధితులకు అందజేశారు. సేకరించిన సమాచారం మేరకు.. ఎర్రన మహేంధర్‌రెడ్డి, ప్రశాంతి అన్నా చెల్లెలు. వారు బెంగళూరు నుంచి ఆర్టీసీ బస్సులో ఆదివారం నెల్లూరుకు వచ్చారు. ఆర్టీసీ ప్రధాన బస్టాండు నుంచి ఆటోలో ఆత్మకూరు బస్టాండుకు వెళ్లారు. అక్కడి నుంచి బస్సులో బిట్రగుంటకు వెళ్లారు. ఇంటికి వెళ్లి లగేజీని చూసుకోగా సూట్‌కేస్ కనిపించలేదు. దీంతో చిల్డ్రన్స్‌పార్కు వద్ద ఉంటున్న బంధువు మాల్యాద్రిరెడ్డికి జరిగిన విషయాన్ని చెప్పి అందులో రూ.20 వేల నగదు, విలువైన వస్తువులున్నాయని తెలిపారు. ఆయన నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణకు విషయాన్ని తెలియజేశారు. ఇన్‌స్పెక్టర్ ఆత్మకూరు బస్టాండు వద్ద విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ పొన్నుస్వామిని అప్రమత్తం చేశారు. ఆయన బస్టాండు పరిసర ప్రాంతాల్లో ఆటో కోసం గాలించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ సిబ్బంది సాయంతో ఆటోను గుర్తించారు. సూట్‌కేసును స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, కానిస్టేబుల్ పొన్నుస్వామి, కమాండ్‌కంట్రోల్ సిబ్బంది హైదర్‌అలీలకు బాధితులకు కృతజ్ఞతలు చెప్పారు.

లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం రేపు

నెల్లూరు(బృందావనం): పద్మావతి నగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరంలో మంగళవారం ఉదయం 9 గంటలకు లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం జరుగనుందని మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి తెలిపారు. అందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆదివారం సాయిమాత అన్నప్రసాదాలయం ద్వారకామాయిలో ఆదివారం ఆవిష్కరించి, స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొనాలని కోరారు.



ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

ఎస్సీ వర్గీకరణ ప్రమాదకరం



నెల్లూరు(వీఆర్సీ సెంటర్): ఎస్సీ వర్గీకరణ ఎంతో ప్రమాదకరమని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నగరంలో ఆదివారం రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమిళనాడు, ఉత్తరప్రదేశ్‌లో కూడా ఎస్సీ వర్గీకరణ చేయడం లేదని, అయితే మన రాష్ట్రంలో చంద్రబాబు ఎందుకు దళితుల్లో విభజన తెస్తున్నారని మండిపడ్డారు. దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

అమీర్‌జాన్‌కు అవార్డు



నెల్లూరు(బృందావనం): విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో 'శ్రమైక జీవనం'పై ఆదివారం చిత్రప్రదర్శన నిర్వహించారు. ఇందులో సింహపురి చిత్రకారుడు అమీర్‌జాన్‌కు అవార్డు వరించింది. ఆయన వేసిన 'కమ్మరి' చిత్రం ప్రముఖుల ప్రశంసలందుకొంది.

హక్కుల కోసం పోరాడాలి



సమావేశంలో పాల్గొన్న సంఘ నేతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): దూదేకులు తమ హక్కుల కోసం పోరాడాలని ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ ఖాదర్‌బాషా పిలుపునిచ్చారు. నగరంలోని నవబాల గుడి వద్ద ఉన్న సమావేశ మందిరంలో నెల్లూరు జిల్లా దూదేకులు, నూర్‌బాషా బీసీ ముస్లిం సంక్షేమ సంఘం 157/2015 జిల్లా కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ హోదాల్లో పదవులు పొందిన నూర్‌బాషాలు సంఘానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. దూదేకుల కుల సర్టిఫికెట్లతో అగ్రవర్ణ ముస్లింలు ప్రయోజనాలు పొందుతున్నారని తెలిపారు. దీని విషయంలో ప్రభుత్వానికి తగిన సమాచారం అందించి దూదేకులు నష్టపోకుండా చూడాలన్నారు. జిల్లా అధ్యక్షుడు కె.బాబర్‌జాన్, జిల్లా యువత అధ్యక్షుడు షేక్ సుభానీబాషా మాట్లాడారు. సమావేశంలో నేతలు షేక్ ఖాజామస్తాన్, షేక్ ఖాజా రహంతుల్లా, షేక్ మస్తాన్, నాయబ్, షేక్ షరీఫ్, షేక్ జహీర్ తదితరులు పాల్గొన్నారు

చంపుతానని బెదిరించి.. నగదు దోచేసి

నెల్లూరు(క్రైమ్): బావను కత్తితో చంపుతామని బెదిరించి నగదు దోచేసిన బావమరిదిపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. జ్యోతినగర్‌కు చెందిన సంధాని టింకరింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆయన బావమరిది సాజిద్ మద్యానికి, చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. ఈనెల 23న సంధానిని మద్యం తాగేందుకు నగదు ఇవ్వాలని సాజిద్ కోరాడు. ఆయన లేవని చెప్పడంతో కత్తితో చంపుతామని బెదిరించి రూ.వెయ్యి నగదను దోచుకెళ్లాడు. ఈమేరకు బాధితుడు శనివారం రాత్రి వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'తెలుగు దర్శనం' పుస్తకావిష్కరణ



నెల్లూరు(బృందావనం): నెల్లూరు జిల్లా రచయితల సంఘం(నెరసం) ఆధ్వర్యంలో జెట్టి శేషారెడ్డి విజ్ఞాన భవనంలో తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా 'అమ్మభాషకు వందనం' అనే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తూమాటి సంజీవరావు రచించిన 'విశిష్ట తెలుగు దర్శనం' పుస్తకాన్ని అడ్వొకేట్, ట్యాక్స్ కన్సల్టెంట్ ఐ.నాగరాజారావు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వాలు తెలుగుభాష పట్ల కంటి తుడుపు చర్యలు చేపడుతున్నాయని, దీనివల్ల తెలుగుభాష అంతరించిపోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కరుణశ్రీ, 'నెరసం' అధ్యక్ష, కార్యదర్శులు ఎ.జయప్రకాష్, పి.అన్నపూర్ణ, చెలంచర్ల భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రోత్సాహక నగదు పంపిణీ

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని తుమ్మగుంట బ్రాహ్మణ సేవా సంఘ భవనంలో 20 మంది విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులను ఆదివారం పంపిణీ చేశారు. గతేడాది జరిగిన పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో ప్రతిభచాటిన వారికి రూ.5 వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో సంఘ నేతలు మాచవోలు భాస్కరశర్మ, ఎ.రామచంద్రమూర్తి, ఎం.సుబ్బుకృష్ణ, పి.నిరంజన్, బీఎస్ శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీహరి



నెల్లూరు (టౌన్): పాలిటెక్నిక్ వర్క్‌షాపు టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పాట్లూరి శ్రీహరి నియమితులయ్యారు. విజయవాడలో ఆదివారం జరిగిన అసోసియేషన్ సమావేశంలో టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ క్రమంలో స్థానిక వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వర్క్‌షాపు అటెండర్‌గా పనిచేస్తున్న శ్రీహరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలలోని సిబ్బంది, ఇన్‌స్ట్రక్టర్లు శ్రీహరికి అభినందనలు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మట్టి గణపతి విగ్రహాలను అందజేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి

నెల్లూరు(బృందావనం): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సత్యవాణి తెలిపారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ట్రంకురోడ్డు గాంధీ సెంటర్‌లో ఉన్న వేంకట్రామా షాపీ-శ్రీశ్రీ ఏజెన్సీస్, పేపర్ మర్చెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త సౌజన్యంతో మట్టి గణపతి విగ్రహాలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆమె విచ్చేసి, మాట్లాడారు. వేంకట్రామా షాపీ అధినేత శ్రీపతి శ్రీనివాసరావు ఎనిమిది వేల మట్టి గణపతులను విద్యార్థులకు అందజేయడం అభినందనీయమన్నారు. ఆధ్యాత్మికవేత్త, యూరాలజిస్ట్ మోహన్‌రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. శ్రీపతి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఎనిమిదేళ్లగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.



ఏసీ స్టేడియం వద్ద..

- స్టోన్‌హౌస్‌పేట పప్పులవీధిలోని పాండురంగ అన్నదాన సమాజంలో కొండా ప్రవీణ్‌శంకర్ చారిటబుల్ ట్రస్ట్, ముక్కాల ద్వారకానాథ్ మిత్రమండలి సంయుక్త ఆధ్వర్యంలో మట్టివినాయక ప్రతిమలు, చీరలను ఆదివారం పంపిణీ చేశారు. నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాలశాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, ముక్కాల ద్వారకానాథ్, శ్రీధర్, పి.ప్రదీప్, శ్రీరామ్‌సురేష్, జ్యోతిప్రసాద్, సుధాకర్, భాస్కర్ పాల్గొన్నారు.
- కరెంటాఫీస్ సెంటర్ గాయత్రినగర్‌లో ఉన్న విద్యార్థి ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్, చిల్డ్రన్స్‌పార్క్, ఎన్టీఆర్ పార్క్ తదితర ప్రాంతాల్లో నాలుగు వేల మట్టి వినాయక ప్రతిమలను ఆదివారం పంపిణీ చేశారు. పాఠశాల కరెస్పాండెంట్ అల్లంపాటి రవీంద్రబాబు, ప్రిన్సిపల్ అల్లంపాటి సంధ్యదేవి తదితరులు పాల్గొన్నారు.

సండే ఆన్ సైకిల్



నెల్లూరు(క్రైమ్): ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల మేరకు పోలీసు కవాతు మైదానంలో ఆదివారం అధికారులు, సిబ్బంది సండే ఆన్ సైకిల్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక యోగా గురువు, హెచ్‌సీ మురళీ ఆధ్వర్యంలో పోలీసులు సామూహిక యోగాసనాలు, సైకిల్ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ సైక్లింగ్ ద్వారా గుండె సంబంధిత వ్యాధులు, ఊబకాయం, మధుమేహం వంటి అనేక రకాల సమస్యలను నివారించవచ్చన్నారు. ఎస్బీ, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీలు ఎ.శ్రీనివాసరావు, చెంచురామారావు, డీసీఆర్బీ, పీసీఆర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌లు రామారావు, భక్తవత్సలరెడ్డి, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

ముగ్గురు రౌడీషీటర్ల అరెస్ట్

సాక్షి టాస్క్‌ఫోర్స్: నెల్లూరు నగరానికి చెందిన ముగ్గురు రౌడీషీటర్లను పోలీసులు అరెస్టు చేశారు. వేదాయపాళేనికి చెందిన జగదీష్‌తో పాటు పడారుపల్లికి చెందిన భూపతి, నాలుగో మైలు దొరతోపునకు చెందిన ఎ.సురేంద్రలను గంజాయి కేసులో వేదాయపాళెం పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసినట్లు తెలిసింది. వీరివద్ద నుంచి కొంత మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇప్పటికే నిడిగుంట అరుణ కాల్ డీటైల్స్ ఆధారంగా పలువురు రౌడీషీటర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వారిని సైతం నేడో, రేపో అరెస్ట్ చూపించే అవకాశం ఉంది. తాజా పరిణామాల నేపథ్యంలో అనేక మంది రౌడీషీటర్లు ఊరు వదిలి పరారయ్యారు. వారి కోసం సైతం పోలీసులు గాలిస్తున్నట్లు తెలిసింది.